# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశ రాజధానిలో ఘనంగా జరిగాయి.
- కర్తవ్య పథ్‌లో జరిగిన పరేడ్ దేశ సైనిక పటిమను, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.
- శక్తివంతమైన భారత్ వల్ల ప్రపంచం మరింత స్థిరంగా, సురక్షితంగా ఉంటుందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్నారు.
- “మన్ కీ బాత్” కార్యక్రమం దేశవ్యాప్తంగా సామాన్యులు చేస్తున్న అసాధారణ కృషిని గుర్తించి, ప్రోత్సహించే వేదికగా అవతరించిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- రానున్న మూడు రోజుల పాటు దేశ రాజధాని ఢిల్లీ, హర్యానా, చండీగఢ్‌లలో తీవ్రమైన చలిగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

==============================

దేశ రాజధాని ఢిల్లీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు కన్నులపండువగా జరిగాయి. కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అజేయమైన సైనిక పటిమ, అద్భుతమైన సాంస్కృతిక వైవిధ్యం మేళవింపుతో సాగిన కవాతు భారత శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పింది. “ఆపరేషన్ సిందూర్”లో ఉపయోగించిన ఆయుధ వ్యవస్థల నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అత్యున్నత శౌర్య పురస్కారం “అశోక చక్ర”ను ప్రదానం చేశారు.

==============================

గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా గర్వించదగ్గ రీతిలో జరిగాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈరోజు జరిగిన పరేడ్ దేశ సైనిక పటిమను, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ప్రధాని సామాజిక మాధ్యమంలో ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. కర్తవ్య పథ్‌లో సాగిన కవాతు కేవలం వేడుక మాత్రమే కాదని, అది భారత శక్తిసామర్థ్యాలకు ప్రతిబింబమని ప్రధానమంత్రి ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల అధినేతలు భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సందేశాలు పంపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. భారత్-అమెరికా సంబంధాలను ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల కలయికగా అభివర్ణించారు. గత ఏడాది కాలంగా భారత్-చైనా సంబంధాలు మెరుగుపడుతున్నాయని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన సందేశంలో పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ స్పందిస్తూ.. భారత గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం జీవితకాల గౌరవం అని పేర్కొన్నారు. శక్తివంతమైన భారత్ వల్ల ప్రపంచం మరింత స్థిరంగా, సురక్షితంగా మారుతుందని, అది అందరికీ ప్రయోజనకరమని ఆమె కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన రైతన్నలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. చైనాను అధిగమించి భారత్.. ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా అవతరించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతు ప్రయోజనాల దృష్ట్యా పప్పుధాన్యాల దిగుమతులపై 30 శాతం సుంకం విధించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింత పటిష్టం చేస్తున్నామని, బీమా క్లెయిమ్‌ల చెల్లింపులో నిర్ణీత గడువు మించితే.. సదరు కంపెనీలు రైతులకు 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని కేంద్రమంత్రి వెల్లడిస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారత రాయబార కార్యాలయాల్లో వైభవంగా జరిగాయి. బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయంలో రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. సింగపూర్‌లో హైకమిషనర్ డాక్టర్ శిల్పాక్ అంబులే ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. టోక్యోలోని భారత రాయబార కార్యాలయంలో నియమిత రాయబారి నగ్మా ఎం. మల్లిక్ జాతీయ జెండాను ఎగురవేశారు. కొలంబోలోని ఇండియా హౌస్‌లో హైకమిషనర్ సంతోష్ ఝా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏకతాటిపైకి తెచ్చి, ఏళ్ల తరబడి నిలిచిపోయిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మోక్షం కల్పిస్తున్న `ప్రగతి` (PRAGATI) వేదిక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఈ దశాబ్ద కాలంలో ఈ వేదిక పారదర్శకతకు, జవాబుదారీతనానికి చిరునామాగా మారింది. ఈ సందర్భంగా దశాబ్దాల పాటు నత్తనడకన సాగి, ప్రగతి సమీక్షతో పట్టాలెక్కిన ఒడిశాలోని హరిదాస్‌పూర్ - పారాదీప్ రైల్వే ప్రాజెక్టును ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఖనిజ సంపద కలిగిన ప్రాంతాలను పారాదీప్ పోర్టుతో అనుసంధానించే లక్ష్యంతో 1997లోనే ఈ ప్రాజెక్టు మంజూరైంది. కానీ.. భూసేకరణ సమస్యలు, నిధుల కొరత, పర్యావరణ అనుమతుల సాకుతో దాదాపు 20 ఏళ్లు మందకొడిగానే సాగింది. 2018 ఆగస్టులో ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి `ప్రగతి` సమీక్ష పరిధిలోకి తెచ్చారు. ఒడిశా ప్రభుత్వం, రైల్వే శాఖలకు నరేంద్రమోదీ స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించారు. ప్రగతి సమీక్ష తర్వాత పనులు పరుగులు తీశాయి. ఫలితంగా 2020లో సరకు రవాణా ప్రారంభం కాగా.. 2024 మార్చిలో తొలి ప్రయాణికుల రైలును జెండా ఊపి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మన్ కీ బాత్" కార్యక్రమం దేశ వ్యాప్తంగా సామాన్యులు చేస్తున్న అసాధారణ కృషిని గుర్తించి, ప్రోత్సహించే గొప్ప వేదికగా అవతరించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కొనియాడారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఆకాశవాణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడిన కేంద్రమంత్రి.. సమాజంలోని ప్రతి వర్గం నుంచి వస్తున్న సానుకూల మార్పులను, వ్యక్తుల విజయగాథలను ఈ కార్యక్రమం దేశం నలుమూలలకూ విస్తరింపజేస్తోందని పేర్కొంటూ…

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ గేయం "వందేమాతరం" 150 ఏళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని దేశ రాజధానిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 2 వేల 500 మంది కళాకారులు నృత్య రూపకం ప్రదర్శించారు. గణతంత్ర పరేడ్‌లో "స్వాతంత్రత కా మంత్ర్ - వందేమాతరం" అనే ఇతివృత్తంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. జాతీయ ఐక్యతకు చిహ్నంగా మారిన వందేమాతరం ప్రస్థానాన్ని ఈ ప్రదర్శన ద్వారా కీర్తించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల పాటు దేశ రాజధాని ఢిల్లీ, హర్యానా, చండీగఢ్‌లలో తీవ్రమైన చలిగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పశ్చిమ అలజడుల ప్రభావంతో రేపు హిమాచల్ ప్రదేశ్, లడఖ్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, చండీగఢ్ సహా హిమాచల్ ప్రదేశ్‌లో రేపటి వరకు దట్టమైన పొగమంచు కురుస్తుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =